● మినీకథ

# సెంటిమెంట్



– దేవగుప్తం అన్నపూర్ణ

నమస్కారం సార్... ఆఫీసులోకి అడుగు పెడుతూండగానే విష్ చేశాడు మా ప్యూన్ యాదగిరి.

'నమస్కారం...' అంటూ సీట్లో కూలబడ్డాను.

'ఏంట్సార్, ఈ రోజు చాలా ముందుగానే వచ్చేశారు!' అడిగాడు యాదగిరి.

ఔను అరగంట ముందుగానే ఆఫీస్ చేరాను.

'ఔనోయ్, ఈ రోజు శనివారం కదా గుడికెళ్ళి, అటునుంచి ఇలా వచ్చేశాను, ఒంటిగంట కెళ్ళి ఒక్కసారే భోజనం చేసెయ్యవచ్చని' చెప్పాను.

'ఔనుకదా సార్, నేను పోస్టాఫీస్‌కెళ్ళి మనీఆర్డర్ చెయ్యాలి. ఈ రోజు శనివారం పన్నెండు వరకే తీసుకుంటాడు. మీరూ ఎక్కడికో డబ్బు పంపాలన్నారు కదా ఇచ్చేస్తే, పన్నెండులోపు వెళ్ళొచ్చేస్తా'.

'అబ్బ! భలే గుర్తు చేశావోయ్. వచ్చే శనివారం శనిత్రయోదశిట. మా ఆవిడ ఈ రోజు పూజకు డబ్బు ఎం.ఓ. చెయ్యమని, మరీ మరీ చెప్పింది. అడ్రస్ కాగితం, డబ్బూ అన్నీ కవర్లో పెట్టింది. నువ్వు గుర్తు చెయ్యకపోయి ఉంటే..' అంటూ పాంట్ జేబులో చెయ్యిపెట్టాను. ఖాళీగా వుంది. ఉలిక్కిపడ్డాను. నాకు బాగు గుర్తుంది. గుడికెళ్తుంటే మా ఆవిడ (డబ్బు) ప్యూన్‌తో పంపిస్తానన్నానని, మా అడ్రస్, పంపవలసిన అడ్రసూ వివరంగా రాస్తూ, దాంతో పాటు ఆ శని పూజచేసే వివరాలున్న పాంప్లెట్ కూడా పెట్టింది. ఓ కవర్లో అది నేను చాలా క్యాజువల్‌గా నా ప్యాంట్ జేబులో పెట్టుకున్నాను. అదిలేదు.

'అదే ఎవరో కొట్టేశారోయ్!' కంగారుగా అన్నాను.

'అదేంట్సార్, మీరు షర్ట్ జేబులో కదా పర్సు అవీ పెడతారు'

'ఔనయ్యా, బస్సుల్లో వస్తాం కదా, ప్యాంటైతే కొట్టేస్తారని షర్ట్ జేబులోనే పెట్టుకుంటా...!' ఈ రోజేంటో చాలా బాధగా అనిపించింది. దేముడికిద్దామనుకున్న డబ్బు పోయినందుకు.

ఒక్కొక్కరే ఆఫీసులో కొస్తున్నారు స్టాఫంతా విషయం తెల్సి అంతా బాధ పడ్డారు. 'పోనీయండి ఇద్దామనుకున్నది శని దేవుడికి కదా. ఆయనే ఈ రకంగా వసూలు చేసేశాడమకోండి!' ఊరట కలిగించటానికి ప్రక్కసీటు మూర్తిగారు చెప్పిన మాటలలో కొంచెం తేరుకున్నారు.

మళ్ళీ పంపిద్దామన్నా నెలాఖరు రోజులు డబ్బు లేదు. (సరే ఎవర్నన్నా అడిగి పంపుదాం. అసలే నాకు రోజులు బాగాలేవు. ఏదిచేసినా ఎదురు తిరుగుతోంది. ఇంట్లో భార్య అనారోగ్యం, ప్రతీ వస్తువులకు రిపేర్లు రావటం, కట్టించిన ఇల్లు ఊరికి కొంచెం దూరంగా ఉండటం వల్ల ఎవరూ అద్దెలకు రాకపోగా, ప్రతినెలా దానికోసం తీసుకున్న లోను కట్టటం. పోనీ మేమేపోయి ఆ ఇంట్లో ఉందామంటే అది మా ఇద్దరి ఆఫీసులకు దూరమని, ఆఫీసులకు దగ్గరగా ఇల్లు అద్దెకు తీసుకోవటం, అద్దె ఇళ్ళ అగచాట్లను భరించటం, పిల్లలకు ఒకరి తర్వాత ఒకరికేదో ఓ అనారోగ్యం చెయ్యటం..ప టన్నిటినీ దృష్టిలో వుంచుకుని, గుళ్ళో ఆచారిగారినడగితే ఆయన చెప్పాడు. శనిపూజ చేయించమని. దాంతోపాటే షిర్డీకి దగ్గరగా వున్న శనిశింగారం అనే ఊళ్ళో మహిమల గల శనీశ్వరాలయం ఉందనీ అక్కడ పూజ చేయిస్తే మంచిదనీ ఉన్న ఒక పాంప్లెట్ కాగితం కూడా ఇచ్చాడు. దాని ఫలితమే ఈ ఎం.ఓ. కథనం. సరే, శనివారం వరకూ టైముందిగా, రెండుమూడు రోజుల్లో ఎక్కడన్న ప్రయత్నించి డబ్బు పంపి శనిపూజ చేయించాలని నిర్ణయించుకున్నారు.

* * * *

రెండు రోజులు గడిచాయి.

తలవంచుకుని సీరియస్‌గా పని చేసుకుంటున్న నేను, 'ఎం.ఓ.సార్' అన్న పోస్ట్‌మేన్ పిలుపుకు ఉలిక్కిపడి తలఎత్తాను.

'ఏమిటి?' అడిగాను.

'ఎం.ఓ.సార్' మళ్ళీ చెప్పాడు.

నాకు ఎం.ఓ. పంపేదెవరబ్బా, అనుకుంటూ సంతకంచేసి, డబ్బు అందుకుంటూ, ఫ్రం అడ్రస్ చూశాను. శ్రీనివాస్ అని ఉంది. ఆ పేరుగల వారెవడబ్బా అనుకుంటూ పోస్ట్‌మేన్ ఎం.ఓ. ఫాం చింపి ఇచ్చిన కాగితం అందుకున్నా.

'పూర్తి ఉత్తరం రాశాను. అందుతోంది అని ఉంది. వెళ్ళిపోతున్న పోస్ట్‌మ్యాన్‌ను వెనక్కి పిలిచాను. 'అసలిది నాదేనా' అనడగాలని. అతనే గబాలునవచ్చి, 'సారీ సార్, ఓ ఉత్తరం కూడా ఉంది' అంటూ ఓ కార్డ్ అందించాడు.

బాగా ఖరికించి రాసినా స్పష్టంగా ఉన్న చేతివ్రాతలో ఉందా కార్డు.

'నమస్కారం సార్'

ఎం.ఓ. పంపినది నేనే. అది మీ డబ్బే. మొన్న బస్‌లో మీ జేబు కొట్టేసిన జేబు దొంగని. కవర్ తీసి చూసిన తర్వాత నేను చాలా సెంటిమెంటల్‌గా ఫీల్ అయ్యాను. మినిమమ్ ఉద్యోగాల కవసరమైన చదువు ఉండీ, చాలా మందిని నిరుద్యోగుల్లాగా, నేనూ ఉండిపోయి, కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా ఖర్మకాలి 'శని' నెత్తిన కూర్చుని, ఈ రకంగా తయ్యారయ్యాను. అసలే 'శని' పీడితుడననుకుంటున్న నాకు, మీ 'శని' కూడా నెత్తిన వేసుకుని భరించే శక్తి నాకు లేదు. అందుకే, మీ డబ్బు మీకు పంపుతున్నాను. ఎం.ఓ. ఛార్జీలు నేనే భరిస్తున్నాను. ఈ విధంగా నేను శని నుంచి విముక్తుణ్ణి కావాలని ప్రార్థిస్తూ, శ్రీనివాస్.

ఇలాంటి దొగలు కూడా ఉంటారా? నిట్టూరుస్తూ తలపైకెత్తాను.

'ఏంటిసార్, విశేషం? చాలా సీరియస్‌గా చదువుతున్నారు ఉత్తరం' అడిగారు మూర్తిగారు.

కార్డు ఆయన కందించాను.

చదివి, 'శుభం! ఇంకేం మీ డబ్బు మీకు చేరింది. ఇక మీరు పంపాలనుకున్న డబ్బు తక్షణం పంపేయండి..' అన్నాడు.

ఔను, ఈరోజు పంపిస్తే శనివారంలోపే చేరుతుంది అనుకుంటూ గభాల్న లేచి, పోస్టాఫీస్‌కి బయల్దేరాను.

నేను పంపాలనుకున్న డబ్బుతో పాటు, ఆ దొంగనాకు ఎం.ఓ. చేయటానికైన ఖర్చు డబ్బు కూడా నా డబ్బుతో జతకలిపి, ఎం.ఓ.చేసి, నాతో పాటుగా ఆ దొంగను కూడా చల్లని చూపు చూడమని మనసారా శనిదేవుణ్ణి ప్రార్థిస్తూ ఆఫీస్‌కు బయల్దేరాను.